క్లుప్తంగా

పాఠశాలకు మైక్‌సెట్ అందజేత


మాట్లాడుతున్న రాయపాటి వెంకటేశ్వర్లు

ఒంగోలు రూరల్ : మండలంలోని ముక్తినూతలపాడు గ్రామంలో పాఠశాలకు మైక్‌సెట్, స్పీకర్ బాక్సులను ప్రముఖ పారిశ్రామికవేత్త, పొగాకు వ్యాపారి రాయపాటి వెంకటేశ్వర్లు ఆదివారం అందజేశారు. హెచ్ఎం దేవసేన అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం


నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

చీమకుర్తి: స్థానిక రామ్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఉత్సాహంగా నిర్వహించారు. బాలబాలికల నృత్యప్రదర్శనలు అలరించాయి. ఎంఈఓ-1, 2 ఎస్.వెంకటేశ్వర్లు, కే శివాజీ, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కళల్లో కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సోమా శేషాద్రి, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, బాలకాశయ్య, మేకల యల్లయ్య, మాజీ ఎంపీటీసీ రమాదేవి, మంచా హరికృష్ణ, నితీష్, హెచ్ఎం ఏ వీరారెడ్డి, స్థానిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమ పూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

టెన్నిస్ టోర్నమెంట్‌లో విజేతల ప్రకటన

గిద్దలూరు రూరల్: ఇన్విటేషన్ లాన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో గిద్దలూరుకు చెందిన జిల్లా లాన్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌రెడ్డి సెమీ ఫైనల్‌లో ప్రవేశం సాధించాడు. చిలకలూరిపేటలో 55 వయస్సు విభాగం వారికి నిర్వహించిన టెన్నిస్ టోర్నమెంట్‌లో డాక్టర్లు మోహన్‌రెడ్డి, ఏ.శంకర్‌రెడ్డి, ప్రసన్న, నాగేశ్వరరావు 6, 4 పాయింట్ల తేడాతో విజేతలుగా నిలిచి సెమీ ఫైనల్‌లో ప్రవేశం దక్కించుకున్నారు. ఈ పోటీలకు ఒంగోలు, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి మొత్తం 50 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా వారికి గిద్దలూరు లాన్ టెన్నిస్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్.రంగారెడ్డితో పాటుగా పలువురు ప్రశంసించారు.

అల్లూరి పోలేరమ్మకు పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు భక్తులు పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

జన సైనికుల్లో చంద్రబాబు చిచ్చురేపారు

- అంతర్గతంగా జనసేన పార్టీని పతనం చేయడమే బాబు లక్ష్యం
- కానీ, పవన్ ధ్యానంతా బాబు భవిష్యత్తుపైనే..
- జనసేన పార్టీ పెట్టి పదేళ్లయినా పట్టుమని పదిమంది అభ్యర్థుల పేర్లు ప్రకటించలేకపోయారు
- కాపుల ఆశాజ్యోతి అయిన రంగా కుమారునికి సైతం మొండి చెయ్యి చూపారు
- విలేకరుల సమావేశంలో విమర్శించిన వైఎస్సార్ సీపీ నాయకుడు రావూరి బుజ్జి


సమావేశంలో మాట్లాడుతున్న రావూరి బుజ్జి

ఒంగోలు: చంద్రబాబు లక్ష్యం జనసేన కనుమరుగు.. అందులో భాగంగానే జనసేనకు కేవలం 24 సీట్లు కేటాయించి జన సైనికుల మధ్య చిచ్చుపెట్టి కుట్రపన్నారని జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన రావూరి బుజ్జి మండిపడ్డారు. జనసేనకు 24 సీట్లు మాత్రమే కేటాయించడం ద్వారా జన సైనికుల ఆత్మస్థైర్యం దెబ్బతిందన్నారు. ఇదేనా పదేళ్లలో పార్టీ పెట్టి మనం సాధించిందని ప్రతిఒక్కరూ బాధపడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీలో ఇమడలేక వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జనసేన, టీడీపీల తీరు గురించి తీవ్రంగా విమర్శించారు. రాజ్యాధికారం కోసం కాపులు దశాబ్దాలుగా ఎదురుచూస్తూనే ఉన్నారని, కాపుల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా జీవించి ఉంటే సాధించి ఉండేవారని అన్నారు. ఆయన హత్యతో కాపుల ఆకాంక్షకు బ్రేక్ పడిందన్నారు. అనంతరం ప్రజారాజ్యం పార్టీతో ఆశలు చిగురించినా అనతికాలంలోనే ఆ పార్టీ కాంగ్రెస్‌లో విలీనమైపోయిందన్నారు. గత పదేళ్ల నుంచి జనసేనతో ఆ ఆకాంక్ష నెరవేరుతుందనే ఉద్దేశంతో కాపులు తీవ్రంగా పోరాడుతుంటే.. నేడు పార్టీని చంద్రబాబు కాళ్ల వద్ద పెట్టి 24 సీట్లతో పోటీకి సై అని పవన్ కళ్యాణ్ అంటుంటే.. ఇదేనా కాపులు కోరుకున్నది అనే బాధ కలుగుతోందన్నారు. పవన్ ధ్యాసంతా ఆయన ప్యాకేజీపైనే ఉందని, పార్టీ పెట్టి పదేళ్లయినా పట్టుమని పదిమంది పేర్లు ప్రకటించకపోవడం దారుణమని అన్నారు. చంద్రబాబు పక్కాగా 94 పేర్లు తయారుచేయించుకుని పవన్ కళ్యాణ్‌కు మాత్రం 24 సీట్లు కేటాయిస్తున్నట్లు హడావిడిగా ప్రకటించి డైలమాలో పడేశారన్నారు. చివరకు మిగిలిన 19 సీట్ల సంగతి అటుంచి కనీసం పవన్ కళ్యాణ్ కూడా తాను ఎక్కడ పోటీచేస్తాడో చెప్పుకోలేని దుస్థితి పార్టీలో నెలకొందన్నారు. ఒక పక్క జన సైనికులు సీఎం సీఎం అని పవన్ కళ్యాణ్ గురించి తమ వైఖరి తెలియజేస్తుంటే.. ఆయన మాత్రం అందుకు విరుద్ధంగా త్యాగాలు చేద్దామంటూ కాపుల ఆకాంక్ష కన్నా, పార్టీ అభివృద్ధి కన్నా చంద్రబాబు భవిష్యత్తుకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని జన సైనికులు గ్రహించారన్నారు. వంగవీటి మోహనరంగా కుమారుడు రాధాకు సైతం ఆయన కోరుకున్న స్థానంలో సీటు కేటాయించుకోలేకపోవడం పవన్ కళ్యాణ్‌కు పార్టీ పట్ల ఉన్న నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఆత్మగౌరవాన్ని చంపుకుని జనసేనలో ఉంటూ టీడీపీకి మద్దతు పలకలేమని, పేద, బడుగు, బలహీనవర్గాలకు పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే మెరుగైన భవిష్యత్తు అందుతుందని భావించి వైఎస్సార్ సీపీలోకి రావడం జరిగిందన్నారు. జిల్లాలో బాలినేని సారథ్యంలో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషిచేస్తానని బుజ్జి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి పెండ్యాల శ్రీను పాల్గొన్నారు.

నూర్ బాషా, దూదేకుల ముస్లిం నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

అల్లూరు (కొత్తపట్నం): మండల నూర్ బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘ మండల నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ మీరావలి ఆధ్వర్యంలో అల్లూరు గ్రామంలోని జెండా చెట్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మండల నూతన అధ్యక్షునిగా షేక్ చిన్న మౌలాలి (అల్లూరు), ప్రధాన కార్యదర్శిగా షేక్ ఫిరోజ్ గాంధీ (మడనూరు), ట్రెజరర్‌గా షేక్ బ్రహ్మవలి (అల్లూరు), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా షేక్ మధుబాషాబాబు (అల్లూరు), ఉపాధ్యక్షునిగా షేక్ బాబావలి (మడనూరు), సంయుక్త కార్యదర్శిగా షేక్ మస్తాన్‌వలి (మడనూరు), ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా షేక్ రహంతుల్లా (మడనూరు), షేక్ శ్రీను (అల్లూరు), షేక్ మస్తాన్‌వలి (అల్లూరు)ని ఎన్నుకున్నారు. మీరావలి మాట్లాడుతూ సంఘాన్ని పటిష్టం చేయడం గురించి వివరించారు. ముస్లింలకు చట్టసభల్లో అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. చిన్న మౌలాలి మాట్లాడుతూ మండల అధ్యక్షునిగా తనను ఎన్నుకోవడం ఆనందంగా ఉందన్నారు. మండలంలోని నూర్ బాషా, దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘానికి బాధ్యతగా పనిచేస్తానన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. విద్య, వైద్యం, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. మన హక్కులపై పోరాటం చేయడానికి ప్రతిఒక్కరూ కదిలిరావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే మస్తాన్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్‌కే మీరామొహిద్దీన్, జిల్లా గౌరవ సలహాదారుడు షేక్ మస్తాన్‌వలి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే ఖాశిం, జిల్లా కోశాధికారి ఎస్‌కే మురళీబాబు పాల్గొన్నారు.

చదలవాడ కృషి అభినందనీయం

- గురుసహస్రావధాని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్
- ఘనంగా ప్రబంధ యుగకర్త ఎర్రా ప్రగడ గ్రంథావిష్కరణ


చదలవాడ లక్ష్మీనరసింహారావు దంపతులను సన్మానిస్తున్న ఒంగోలు బ్రాహ్మణ సేవాసమితి ప్రతినిధులు

ఒంగోలు మెట్రో: కవిత్రయంలో ఒకనిగా ప్రబంధ పరమేశ్వరునిగా ప్రసిద్ధి చెందిన మహాకవి ఎర్రనను ప్రబంధ యుగకర్తగా నిరూపిస్తూ ప్రముఖ కవి పద్య సారస్వత పరిషత్తు జాతీయ అధ్యక్షుడు చదలవాడ లక్ష్మీనరసింహారావు ప్రబంధ యుగకర్త ఎర్రాప్రగడ అనే పరిశోధనాత్మక గ్రంథాన్ని వెలువరించడం అభినందనీయమని గురుసహస్రావధాని డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్ అన్నారు. పద్య సారస్వత పరిషత్తు ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఒంగోలులోని బ్రాహ్మణ సేవా సమితి శుభప్రదం కమ్యూనిటీ హాలులో నిర్వహించిన చదలవాడ లక్ష్మీనరసింహారావు విరచిత ప్రబంధ యుగకర్త ఎర్రాప్రగడ గ్రంథావిష్కరణ కార్యక్రమంలో వరప్రసాద్ పాల్గొని గ్రంథ సమీక్ష నిర్వహించారు. చదలవాడ లక్ష్మీనరసింహారావు రచించిన ప్రబంధ యుగకర్త ఎర్రా ప్రగడ గ్రంథం పరిశోధక విద్యార్థులకే కాకుండా ప్రతిఒక్కరికీ ఉపయుక్త గ్రంథమని ప్రశంసించారు. చదలవాడ లక్ష్మీనరసింహారావుకు డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్ అభినందనలు తెలిపారు. చదలవాడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ ఎర్రన జన్మించిన వంశంలోనే తాను కూడా జన్మించానని, ప్రబంధ పరమేశ్వరునిగా ప్రబంధ కవిత్వానికి తెలుగులో నాంది పలికిన ఎర్రన గురించి తాను ఎంతో శ్రమించి పరిశోధనాత్మకంగా రచించిన ప్రబంధ యుగకర్త ఎర్రా ప్రగడ గ్రంథాన్ని ఎర్రనకు అంకితమిస్తున్నట్లు ప్రకటించారు. గ్రంథ ఆవిష్కరణ సభకు పద్య సారస్వత పరిషత్తు ప్రకాశం జిల్లా శాఖ అధ్యక్షుడు మాగంటి శ్రీరామమూర్తి అధ్యక్షత వహించగా, అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ జీవీ సుబ్బారెడ్డి గ్రంథ ఆవిష్కరణ కర్తగా పాల్గొని ప్రసంగించారు. బ్రిటానియా కంపెనీ విశ్రాంత అధికారి చదలవాడ బాబా, నాగభైరవ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు టి.అరుణ, పద్య సారస్వత పరిషత్తు నెల్లూరు శాఖ అధ్యక్షుడు పోలవరపు నరసింహారావు, సృజన అధ్యక్షుడు గాడేపల్లి దివాకరదత్తు, సృజన పూర్వ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, విశ్వకళాభారతి అధ్యక్షుడు నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వరశర్మ, అక్షర సాహితీ సమితి అధ్యక్షుడు ఎంవీఎస్ శాస్త్రి తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం చదలవాడ లక్ష్మీనరసింహారావు దంపతులను, అతిథులను ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షులు మహంకాళి శేషయ్య, కార్యదర్శి గంజాం రంగనాథ్, ఉప కార్యదర్శి బీమా శంకర్శాస్త్రి, సభ్యులు మద్దులూరి హరి, మైనంపాటి సాయి, పింగళి పూర్ణచంద్రరావు ముక్తినూతలపాటి వాసు, సాహిత్య అభిమానులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి రామాయణంపై ప్రవచనం


పొన్నూరుకి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఒంగోలు మెట్రో: రామాయణం ఆదికావ్యం, శ్రీరామకథ మధురాతి మధురం, మానవతా విలువలకు ప్రతీక వాల్మీకి రామాయణం అని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసముడు, ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు అన్నారు. ఒంగోలు మండలం వలేటివారిపాలెంలో వెలసిన కోదండరామస్వామి దేవస్థానంలో వాల్మీకి రచించిన సంపూర్ణ రామాయణ ప్రవచనాన్ని పొన్నూరు శ్రీనివాసులు ప్రారంభించారు. 24 వేల శ్లోకాలతో బాలకాండ, అయోధ్యకాండ, అరణ్యకాండ, కిష్కింధకాండ, సుందరకాండ, యుద్ధకాండ, ఉత్తరకాండలుగా రాముడి చరిత్రను వాల్మీకి మహర్షి జనులకు అందించారని అన్నారు. రామాయణ పారాయణ, ప్రవచనం, గానం, సర్వోత్కృష్టమైనదని అన్నారు. పది రోజుల పాటు జరిగే వాల్మీకి సంపూర్ణ రామాయణ ప్రవచన యజ్ఞానికి విచ్చేసిన ప్రవచకులు బ్రహ్మశ్రీ పొన్నూరు శ్రీనివాసులుకు నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా కోదండరామస్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించిన అనంతరం ఉపన్యాస యజ్ఞాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఱ్ఱన సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, శ్రీవారి సేవకులు పొత్తూరి బదరి గోపాల్, అర్చకులు నారాయణం కళ్యాణ చక్రవర్తి, నిర్వాహకురాలు ఇందు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బస్తీ సంపర్కం అభియాన్ నిర్వహణ


ర్యాలీలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు

ఒంగోలు సెంట్రల్: బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పెరిక లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఆదివారం దళిత రచ్చబండలో భాగంగా బస్తీ సంపర్కం అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలులోని కర్నూలు రోడ్డులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.దేవానంద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి రవి శంకర్, ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్, అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, జోనల్ ఇన్‌చార్జి పేముల మోజీ, తోగంటి శ్రీనివాస్, సంగం శ్రీనివాస్, శివాజీ, కోటేశ్వరి, రాజశేఖర్, అజయ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పలు సంక్షేమ పథకాలు, ఆయుష్మాన్ భారత్ గురించి వివరించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులే తెలుగు భాషకు బలం

- గురుసహస్రావధాని డాక్టర్ కడిమెళ్ల


ఆధ్యాత్మిక ప్రవచకుడు మైనంపాటి సాయిని సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు


ఒంగోలు మెట్రో: తెలుగుభాష కనుమరుగవుతోందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విద్యార్థులే సైన్యంగా ఏర్పడి తెలుగు భాషను తప్పక రక్షిస్తారని గురు సహస్రావధాని డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక మంగమూరు రోడ్డు బైపాస్లో శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల ఆవరణలో తెలుగు భాష అభ్యాసం ఆవశ్యకత అనే అంశం గురించి విద్యార్థులకు అర్థమయ్యేలా ఆయన ప్రసంగించారు. విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి ఎక్కువని, మాతృభాషపై మమకారం ఉందని, వారిని మనం ప్రోత్సహించి మరింత ఉత్సాహపరచాలని అన్నారు. ఏదైనా సరే ఒకటికి పది సార్లు చదివితే రాకుండా ఉండే పాఠం ఉండదన్నారు. మాతృభాషలో పట్టు సాధించిన వారు మాత్రమే ఇతర భాషల్లో రాణించగలరని గుర్తు చేశారు. తెలుగు పద్యాలను వినడం, అవధాన కార్యక్రమాలను చూడటం వల్ల భాష పట్ల మమకారం ఏర్పడుతుందని చెప్పారు. 8 కోట్ల మంది తెలుగువారిలో ఆరుగురు సహస్రావధానులు ఉండటం తెలుగుజాతికి గర్వకారణమని అన్నారు. ప్రపంచంలోని ఏ భాషలోనూ పద్యం అనే ప్రక్రియ లేకపోవడం మన గొప్పతనాన్ని తెలియజేస్తుందన్నారు. జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్, లైన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహించగా, జేసీఐ పూర్వ జాతీయ అధ్యక్షుడు నైనాల రామకృష్ణ సభాధ్యక్షత వహించారు. లైన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షుడు వెన్నపూస శ్రీరాములురెడ్డి, జేసీఐ చైర్మన్ పి.నందకుమార్, ఉపాధ్యక్షుడు కే శివకోటిరెడ్డి, జేసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే గోపికిషోర్, విద్యావేత్తలు ఎస్డీ ఇస్మాయిల్, సోమినేని సురేష్ తదితరులు నిర్వాహకులుగా వ్యవహరించారు. తెలుగు భాషా సేవకులకు సత్కారం కార్యక్రమంలో భాగంగా తెలుగు భాషకి సాహిత్యం, నాటకం, రచనల ద్వారా సేవ చేస్తున్న పలువురిని ఘనంగా పురస్కారాలతో సత్కరించారు. ఉన్నం జ్యోతి వాసు, గణపతిరాజు వెంకటరావు, షేక్ మహబూబ్ జాన్, నెమ్మాని సీతారామమూర్తి, మైనంపాటి సాయికుమార్, ధేనువుకొండ వెంకట సుబ్బారావును తెలుగు భాషా పురస్కారాలతో సత్కరించారు

అంగరంగ వైభవంగా శివ పార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో ఆదివారం శివ పార్వతుల కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు మణిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణ మహోత్సవానికి వీక్షించేందుకు పట్టణానికి చెందిన భక్తులు భారీగా హాజరయ్యారు. శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో వేకువ జాము నుంచి ప్రణవ పంచాక్షరీ, ఓం నమశ్శివాయ ఏకాహం, సుప్రభాతసేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపార్చన కార్యక్రమాల నడుమ నిర్వహించారు. 101 ప్రమిదలతో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణంలో పట్టణానికి చెందిన పలువురు దంపతులు పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు మణిశర్మ మాట్లాడుతూ ద్వాదశ జ్యోతిర్లింగాలుగా, అష్టదశ శక్తి పీఠాల్లో ఒక్కటైన శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వెలిసిన శ్రీశైల పుణ్యక్షేత్రానికి ముఖద్వారంగా ఉన్న పెద్దదోర్నాలలోని లక్ష్మీ నృసింహ స్వామి ఆలయంలో లోక కల్యాణార్థం శివపార్వతుల కల్యాణం, లక్షా దీపోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో పలువురు పాల్గొని లోక కళ్యాణం కోసం ప్రత్యేక హోమాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో నగరోత్సవాన్ని నిర్వహించారు.

కరవది హైస్కూలుకు రూ.4 లక్షల విరాళం


మాట్లాడుతున్న పూర్వ విద్యార్థిని లక్ష్మీకుమారి, పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఒంగోలు రూరల్ : ఎన్ఆర్ఐలు, పూర్వ విద్యార్థులు సంయుక్తంగా కరవది జిల్లా పరిషత్ హైస్కూలుకు రూ.4 లక్షల విరాళం అందజేశారు. కరవది హైస్కూలులో ఆదివారం జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో తాము చదువుకున్న కరవది హైస్కూలు అభివృద్ధి పనులకు విరాళం అందజేస్తున్నట్లు తెలిపారు. వారంలో పనులు ప్రారంభించి పూర్తిచేయనున్నట్లు చెప్పారు. తొలుత పాఠశాలలో ఉన్న వంటగదిని విస్తరించనున్నట్లు వెల్లడించారు. అనంతరం బాలబాలికల సైకిల్‌స్టాండు నిర్మాణాలు, ప్రహరీ, గేటు నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. పాఠశాల పూర్వ విద్యార్థిని ఎస్.లక్ష్మీకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయ బృందం, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

సీవీఎన్ రీడింగ్ రూం ఎన్నికల అధికారుల నియామకం


ఎన్నికల అధికారులకు రికార్డులు అందజేస్తున్న పాలకవర్గం

ఒంగోలు టౌన్: సీవీఎన్ క్లబ్ అండ్ రీడింగ్ రూం ఎన్నికల అధికారులుగా సీనియర్ సభ్యులైన బేతంశెట్టి హరిబాబు, తోట రామస్వామిని నియమిస్తూ జనరల్ బాడీ తీర్మానించింది. ఆదివారం క్లబ్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. పాలకవర్గ కమిటీ పదవీ కాలం ముగిసినందున నూతన కమిటీని ఎన్నుకోవాలని సమావేశం నిర్ణయించింది. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఎన్నికల అధికారులను నియమిస్తున్నట్లు క్లబ్ సెక్రటరీ మొగలిపువ్వు సత్యనారాయణ తెలిపారు. తమ పదవీకాలంలో జమా ఖర్చుల వివరాలను సభ్యులకు వివరించిన ఆయన.. అనంతరం ఎన్నికల అధికారులకు క్లబ్ తాలూకు రికార్డులు అందజేశారు. తమ హయాంలో క్లబ్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని వివరించారు. సమావేశంలో పాలకవర్గం అధ్యక్షుడు తాతా శ్రీనివాసులు, కోశాధికారి రామిరెడ్డి నితిన్‌రెడ్డి, కార్యవర్గసభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, బూచి వనమాలి, ఉన్నవ శేషుబాబు, యేసుపోగు ఏసుదాసు, తిరుమలశెట్టి శ్రీరామమూర్తి, మేనేజర్ భవనం శివారెడ్డి పాల్గొన్నారు.

తాళ్లూరుకు ఇంటర్ పరీక్ష కేంద్రం మంజూరు

తాళ్లూరు (ముండ్లమూరు): మండల కేంద్రమైన తాళ్లూరులో గల ఊటుకూరి కోటయ్య శ్రేష్ఠ మెమోరియల్ బోర్డు హైస్కూల్, జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రం మంజూరైనట్లు ప్రిన్సిపల్, జిల్లా పరీక్షల నిర్వహణ బోర్డు కమిటీ సభ్యులు కె. ఆంజనేయులు ఆదివారం తెలిపారు. గతంలో ఈ కాలేజీలో పరీక్ష కేంద్రం ఉండగా విద్యార్థుల సంఖ్య తగ్గడంతో పరీక్ష కేంద్రాన్ని రద్దు చేశారు. దీంతో పరీక్షలు రాయడానికి విద్యార్థులు దర్శి వెళ్లాల్సి వచ్చింది. విద్యార్థులు నానా అవస్థలు పడటంతో సమస్యను గ్రామ పెద్దలు ఆర్ఐఓ, ఆర్‌జేడీ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి తోడు ప్రస్తుతం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కాలేజీలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో పరీక్ష కేంద్రాన్ని మంజూరు చేశారు.

ఆలయానికి ఒంటె వాహనం బహూకరణ

చీమకుర్తి: చీమకుర్తిలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయానికి అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆదివారం ఒంటె వాహనంను బహూకరించారు. ఆలయంలో స్వామివారి ఊరేగింపు సందర్భంగా ఒంటె వాహనంను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మద్దాళి వెంకటేశ్వర్లు, రాజమ్మ, పవన్‌కుమార్ జ్ఞాపకార్థం ఒంటె వాహనంను బహూకరించారు. ఈ సందర్భంగా మాధవరావు దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

చంద్రబాబువి ఓటు బ్యాంకు రాజకీయాలు

యర్రగొండపాలెం (పుల్లలచెరువు): బడుగు, బలహీన వర్గాల వారిని చంద్రబాబునాయుడు కేవలం ఓటు బ్యాంకు వాడుకుని వదిలేసే రకమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాటి పర్తి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ నగర్, ఇజ్రాయిల్ పేటలోని పలు చర్చిలల్లో ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడుని రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరని, గత పాలనలో ఆయన చేసిన అరాచకాలు ప్రజలకు గుర్తుండి పోయిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల పేద ప్రజలకు మేలు జరిగే విధంగా సంక్షేమ పథకాలు అమలు పరిచి వారి గుండెల్లో నిలిచిన గొప్ప వ్యక్తిని ఆయన అన్నారు. తిరిగి జగనన్న ముఖ్యమంత్రిగా చేసుకోవాలని బడుగు, బలహీన, దళిత వార్గాలకు చెందిన వారు ఎదురు చూస్తున్నారన్నారు. నియోజకవర్గంలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, దళితవాడలో నెలకొన్న ఉన్న సమస్యలు తన దృష్టికి తీసుకొని వచ్చినట్లయితే తాను వెంటనే పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ముందుగా చంద్రశేఖర్ రాకను గమనించిన కాలనీవాసులు పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తి రెడ్డి, ఎంపీపీ కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ విజయభాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు కె. ఓబుల్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, సర్పంచ్ అరుణాబాయ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ జబీబుల్లా, నాయకులు నర్రెడ్డి వెంకట రెడ్డి, కోటేశ్వరరావు, వై. వెంకటేశ్వరెడ్డి, బి. బాల చెన్నయ్య పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న చంద్రశేఖర్

యర్రగొండపాలెం (పుల్లలచెరువు): మనస్సున్న మనిషిగా తన దాతృత్వాన్ని చాటుకున్నాడు తాటిపర్తి చంద్రశేఖర్. యర్రగొండపాలెంకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త షేక్ శిలార్ (మోటర్ మెకానిక్) అనే కార్యకర్త గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజికవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం శిలార్ ఇంటికి వెళ్లి పరామర్శించి 10వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసి మంచి మనస్సు చాడుకున్నాడు చంద్రశేఖర్. కుటుంబ సభ్యులు చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలను తెలియచేశారు. ఆయన వెంట జిల్లా వైఎస్సాఆర్ సీపీ ఉపాధ్యక్షుడు మూర్తి రెడ్డి, ఎంపీపీ కిరణ్ గౌడ్, జెడ్పీటీసీ విజయభాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములునాయక్, సర్పంచ్ అరుణాబాయ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, వెంకటరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.